క్లుప్తంగా

ఈరన్నస్వామికి అభిషేక పూజలు

కౌతాళం: మండలంలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తుల రాకతో క్షేత్రంలో సందడి నెలకుంది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం చేసి ఫల,పుష్పాలతో అలంకరించారు. కొందరు భక్తులు క్షేత్ర ఆవరణలో పిండి వంటలు వండి స్వామి వారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

29న రేణుక ఎల్లమ్మ రథోత్సవం



ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డిని ఆహ్వానిస్తున్న కోసిగి నాయకులు

కోసిగి: ఈనెల 29వ తేదీన కోసిగి ప్రజల ఆరాధ్య దేవత శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి మహా రథోత్సవం జరుగనుంది. ఇందుకు హాజరు కావాలని ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్ సీపీ నాయకులు నాడుగేని వీరేష్, మంగమ్మ, నరసింహులు, కోసిగయ్యలతో పాటు పలువురు నాయకులు సోమవారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యులు వై. ప్రదీప్ రెడ్డి, మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డిని కలిసి ఆహ్వానించారు.

కబడ్డీ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారుడు అరుణ్ కుమార్

ఆదోని సెంట్రల్: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఆదోని పట్టణం అరుణ్ జ్యోతి నగర్‌కు చెందిన ఫిలిప్ కబడ్డీ టీం ప్లేయర్ అరుణ్ కుమార్ ఎంపికై నట్లు క్రీడాకారుల అసోసియేషన్ సెక్రటరీ ఆర్. సుభకర్ సోమవారం తెలిపారు. ఈ నెల 25న కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల ఎంపిక పోటీలు జరిగాయన్నారు. ఇందులో అరుణ్ కుమార్ ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికయ్యాడని చెప్పారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చేనెల మార్చి 8 నుంచి 10వ తేదీ వరకు నెల్లూరు జిల్లా కొవ్వూరులో జరిగే 70వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారన్నారు. అరుణ్ కుమార్‌ను ఫిలిప్ అసోసియేషన్ సభ్యులు అమర్ ప్రకాశ్, మారి రామాంజి, జయరాం, దుబ్బి గోపి తదితరులు అభినందించారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

కోసిగి: పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులతో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈఓ నాగేశప్ప సూచించారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించి పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు సిలబస్ ఆధారంగా క్షణ్ణంగా చదువుకోవాలని చెప్పారు.

వేడుకగా ఊరేగింపు

కౌతాళం: హాల్వి గ్రామంలో వెలసిన మహంత స్వామి మఠంలో కొలువైన మహంతస్వామి విగ్రహాన్ని కర్ణాటకలోని చానస్పూర గ్రామ భక్తులు రూ.5లక్షలు వెచ్చించి వెండితో తయారు చేయించారు. వారు విగ్రహాన్ని కర్ణాటలోని బాగవాడి, హచ్చోళ్లి, మురణి, మండలంలోని కాత్రికి, పొదలకుంట గ్రామాల మీదుగా సోమవారం ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఈఏడాది ఏప్రిల్ 26న జరిగే ఉత్సవాల్లో స్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామని మఠం నిర్వాహకులు తెలిపారు.

అటవీశాఖ దోపిడీని అరికట్టాలి

ఆదోనిరూరల్: శ్రీశైలం పాదయాత్రగా వెళ్లే భక్తుల నుంచి అటవీశాఖ వారి ఆర్థిక దోపిడీని వెంటనే ఆపాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బసవన్నగౌడ్, భజరంగదళ్ జిల్లా ప్రముఖులు రవిశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయనశర్మకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలం దేవస్థానానికి 15 రోజుల ముందు నుంచి భక్తులు పాదయాత్ర చేయడం తరతరాలుగా వస్తున్న సంప్రదాయమన్నారు. అయితే ఈ ఏడాది పాదయాత్ర చేస్తున్న భక్తుల నుంచి నల్లమల అటవీశాఖ అధికారులు పర్యావరణ నిర్వహణ పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ.10 వసూలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో హనుమంతరెడ్డి, పంపాపతి, చెన్నబసప్ప, శివస్వాములు, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ల అభివృద్ధికి శ్రీకారం





విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ బి. శాంత, మంత్రాలయంలో విద్యార్థులతో రైల్వే అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

మంత్రాలయం : మంత్రాలయం రోడ్డు రైల్వే స్టేషన్ పునరాభివృద్ధికి కేంద్రం ప్రభుత్వం రూ.3.58 కోట్లు కేటాయించిందని రైల్వే శాఖ ఏడీఎస్ టీఈ విష్ణువర్ధన్ రెడ్డి, మంత్రాలయం స్టేషన్ మాస్టర్ వంశీక్ పేర్కొన్నారు. సోమవారం మంత్రాలయం రైల్వే స్టేషన్‌లో వైఎస్సార్ సీపీ కోసిగి మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డితో కలిసి పునరాభివృద్ధి పనులకు పూజలు చేసి శంకు స్థాపన చేశారు. ముందుగా కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రసంగం వీక్షించారు. అమృత్ భారత్ కింద నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. సీఐ ఎరిసా వలి, మాదవరం ఎస్‌ఐ కృష్ణమూర్తి, బీజేపీ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, రైల్వే అధికారులు అక్షయ్‌కుమార్, నాగార్జున, సాజిద్, సునీల్ కుమార్, సిద్దారెడ్డి పాల్గొన్నారు.

ఆదోని రైల్వేస్టేషన్ ఆధునీకరణకు శంకుస్థాపన

ఆదోని సెంట్రల్: అమృత్ భారత్ పథకం కింద రూ. 10.26 కోట్లతో ఆదోని రైల్వే స్టేషన్ ఆధునీకీకరణ పనులను దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా సోమవారం ప్రారంభించారు. జిల్లా అధికారులు, బీజేపీ నాయకులు కలసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌జైన్ మాట్లాడుతూ రైల్వే స్టేషన్‌ను ఆధునీకరించడం శుభపరిణామం అన్నారు. సీనియర్ సిటిజన్స్, చంటి పిల్లలు, వికలాంగులు వంటి వారు ఒక ప్లాట్‌ఫాం నుంచి మరో ప్లాట్‌ఫాంకు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉండేదన్నారు. ప్రయాణికుల ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం ఆధునీకరణ పనుల ద్వారా మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తుందన్నారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మతో పాటు డీఎస్పీ శివనారాయణ స్వామి, పురపాలక చైర్‌పర్సన్ బి. శాంత, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విట్టారమేష్, గుంతకల్ డివిజనల్ సినియర్ అధికారి క్రిష్టప్ప, స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలను గడువులోపు పరిష్కరించాలి



ప్రజా మస్యలను తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోనిరూరల్: స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని సబ్‌కలెక్టర్ శివనారాయణ శర్మ సూచించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల ద్వారా వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ వారంలోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా చూడాలన్నారు.

స్పందనలో అర్జీల ద్వారా వచ్చిన సమస్యల్లో కొన్ని....

➤ నందవరం మండలం ఇబ్రహీంపురం గ్రామానికి సంబంధించి సర్వేనంబర్ 304/ఏ2లో 1.39 ఎకరాల భూమి ఉంది. సదరు భూమిని కొందరు ఆక్రమణ చేశారు. దయచేసి సదరు భూమి సమస్యను పరిష్కరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసి పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని బాధితుడు అర్జీ సమర్పించారు.

➤ నందవరం మండలం నది కై రవాడి గొల్లబాబుకు సంబంధించి సర్వేనంబర్ 187/సీలోని 2 ఎకరాల భూమి కొనుగోలు ద్వారా సంక్రమించింది. ప్రస్తుతం సదరు భూమి ఆన్‌లైన్‌లో తన పేరుపై నమోదు చేయాలని వినతిపత్రం సమర్పించారు.

➤ కౌతాళం మండలం బాపురం గ్రామానికి చెందిన లక్ష్మిదేవమ్మకు చెందిన సర్వేనంబర్ 90లో 2.24 ఎకరాల భూమి కొనుగోలు ద్వారా సంక్రమించింది. డాక్యుమెంట్ నంబర్ 699/1970లో రిజిస్టర్ చేయడం జరిగింది. ప్రస్తుతం సదరు భూమి రిజిస్ట్రేషన్ కోసం వెళ్లినప్పుడు దేవదాయ భూమిగా చూపిస్తుందని, దయచేసి విచారణ చేసి నా భూ సమస్యను పరిష్కరించాలని బాధితుడు అర్జీ సమర్పించారు.

➤ ఆదోని మండలం ఇస్వీ గ్రామానికి చెందిన మాదిగ నరసమ్మకు సంబంధించి సర్వేనంబర్ 429 బీ3లో 1.95 ఎకరాల భూమి ప్రభుత్వం నుంచి సంక్రమించింది. సదరుభూమిలో సుమారు 20 సంవత్సరాలు పైగా అనుభవంలో ఉన్నారు. ప్రస్తుతం సదరు భూమి నిషేధిత జాబితాలో ఉందని, విచారణ చేసి నిషేధిత జాబితా నుంచి తొలగించాలని అర్జీ సమర్పించారు. కార్యక్రమంలో కార్యాలయపు పరిపాలనాధికారి శేషయ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, డీఎల్‌పీవో శ్రీనివాసరాజు, గృహనిర్మాణశాఖ డిప్యూటీ ఇంజినీర్ రవికుమార్, ఆర్‌అండ్‌బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్‌రఫీ, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్విరామంగా పంచాక్షరీ మంత్ర పఠనం



పంచాక్షరీ మంత్రం పఠిస్తున్న నాగరాజుస్వామి



జ్యోతిర్ముడి కట్టుకుని శ్రీశైలానికి బయలుదేరుతున్న శివస్వాములు

పెద్దకడబూరు : 14 గంటలకు పైగా నిర్విరామంగా 1,16,640 సార్లు శివ పంచాక్షరీ మంత్రం (ఓం నమశ్శివాయ) పఠించాడు. మండల కేంద్రానికి చెందిన సాలె నాగరాజు గత కొన్ని సంవత్సరాలుగా శివదీక్ష స్వీకరిస్తున్నాడు. గ్రామంలో శివమాల, అయ్యప్ప మాల ధరించే వారందరికీ గురుస్వామిగా వ్యవహరిస్తున్నాడు. గత నాలుగు సంవత్సరాలుగా 14 గంటల పాటు పంచాక్షరీ మంత్రం పఠిస్తున్నాడు. అందులో భాగంగానే సోమవారం ఉదయం 6.30 గంటలకు పంచాక్షరీ మంత్రం పఠనం ప్రారంభించి రాత్రి 8గంటలకు ముగిసింది. ఉదయం నుంచి అన్న పానీయాలు తీసుకోకుండా, ఆశీనం నుంచి లేవకుండా పఠించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో శివయ్యకు పూజలు

ఆదోనిఅర్బన్: మహాశివరాత్రిని పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో శివయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుస్వామి శైలేంద్రనాథ్ ఆధ్వర్యంలో జ్యోతిర్లింగేశ్వరస్వామికి పడిపూజ చసి, శ్రీశైలానికి ఇరుముడి కట్టుకొని బయలుదేరారు. వేకువజామున స్వామికి పంచామృతాభిషేకం, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుస్వామి సమక్షంలో 11 రోజులపాట మాలదీక్షను దాదాపు 100 మంది భక్తులు మాలధారణ స్వీకరించారు. అనంతరం 12 జ్యోతిర్లింగాలకు జ్యోతిని వెలిగించి పడిపూజ చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఆదోనిటౌన్: ఆదోని పట్టణ ప్రజల సమస్యలను పరిష్కరించడమే స్పందన లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ఏదైనా సమస్య ఉంటే ప్రజలు తమదృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. అక్రమ కట్టడాలు, శివారు ప్రాంతాల్లో తాగునీటి సమస్య, వీధి దీపాల సమస్యలపై కొందరు అర్జీలు సమర్పించారని చెప్పారు. ఆ సమస్యలను నిర్ణీత కాలంలో పరిష్కరిస్తామన్నారు.



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు





కనకదాసు విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న బసలింగమ్మవ్వ, వాల్మీకి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం

పెద్దకడబూరు : మండలంలోని కంబదహాల్ (కంపాడు) గ్రామంలో సోమవారం వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం కోలాటాలు, రాత్రి భజన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్‌కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు సాయి కిరణ్‌రెడ్డి, వెంకటేష్, పరమేష్ పాల్గొన్నారు.

మండలంలోని చిన్నతుంబళం గ్రామంలో శ్రీ కనకదాస విగ్రహ, శిఖర, కళశ ప్రతిష్ఠ వేడుకలు సోమవారం కురుబ కులస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నిత్య పూజలతో పాటు హోమాల అనంతరం విగ్రహ, కలశ ప్రతిష్ఠగావించారు. బాపురం గంగాభవానీ ఆలయ అధ్యక్షులు బసలింగమ్మవ్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ఎంపీ గోరంట్ల మాధవ్ హాజరై మొక్కులు తీర్చుకున్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ముత్తమ్మ పాల్గొన్నారు.

రాజకీయాలకు సంబంధం లేకుండా ముస్లిం మహాగర్జన



మహాగర్జన ఏర్పాట్లపై నాయకులతో చర్చిస్తున్న ఎమ్మార్పీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా

ఆదోనిరూరల్: రాజకీయ పార్టీలతోనూ, నాయకులతోనూ ఎలాంటి సంబంధం లేకుండా కేవలం ముస్లింల హక్కులు సాధించుకోవడం కోసం, వక్ఫ్ ఆస్తులను కాపాడడం కోసం ఈనెల 29న ముస్లిం మహాగర్జన ఆదోనిలో నిర్వహిస్తున్నామని ఎమ్మార్పీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ షేక్ మహబూబ్‌బాషా తెలిపారు. సోమవారం పట్టణంలోని పెద్ద మసీదు వెనుకవైపు ఉన్న మసూదియా ఉన్నత పాఠశాల మైదానంలో ముస్లిం మహాగర్జనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ముస్లిం తన గొంతు వినిపించాలన్నారు. రెండు రోజుల క్రితం రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీలు ప్రకటించిన 118 ఉమ్మడి అభ్యర్థుల జాబితాలో కేవలం ఒక్క ముస్లింకు మాత్రమే పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వడం చాలా అన్యాయమన్నారు. రాష్ట్రంలో ఓటింగ్ శాతంలో 8 శాతం ముస్లింలు ఉన్నారని, అయినా ఒక్కరికే టికెట్ ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా జనసేన, టీడీపీ పార్టీలు వచ్చే జాబితాలో ముస్లింలకు అత్యధిక స్థానాల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ముస్లింలకు అత్యధికంగా ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలు ఇచ్చిన వారికే ఎమ్మార్పీఎఫ్ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. మహాగర్జనకు ఆదోని డివిజన్‌లోని ఎమ్మిగనూరు, పత్తికొండ, మంత్రాలయం, ఆలూరు, ఆస్పరి, హొళగుంద, మంత్రాలయం, ఆస్పరి ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

సబ్‌కలెక్టర్ వాహనాన్ని ఢీకొన్న బైక్



గాయపడిన బైకిస్ట్



దెబ్బతిన్న సబ్‌కలెక్టర్ వాహనం ముందు భాగం

ఆదోనిఅర్బన్: సబ్ కలెక్టర్ ప్రయాణిస్తున్న కారును బైక్ ఢీకొంది. సోమవారం రాత్రి ఆదోని పట్టణ శివారులోని బైపాస్ రోడ్డులో ఈ ఘటన జరిగింది. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని విరుపాపురం గ్రామానికి చెందిన ఖాసీం అనే యువకుడు బైకుపై వేగంగా ములుగుందంకు వెళ్తున్నాడు. బైపాస్ వద్ద అదుపుచేయలేక సబ్‌కలెక్టర్ వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో యువకుడు ఖాసీంకు తీవ్ర గాయాలయ్యాయి. స్పందించిన సబ్‌కలెక్టర్ వాహన డ్రైవర్ ఆ యువకుడిని చికిత్స నిమిత్తం ఆటోలో ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించాడు. కాగా సబ్‌కలెక్టర్ వాహనంలో సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ లేరని పోలీసులు తెలిపారు. యువకుడిని మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేసినట్లు చెప్పారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

డబ్ల్యూటీఓ ఒప్పందం విరమించుకోవాలి

ఆదోనిరూరల్: డబ్ల్యూటీఓ ఒప్పందాన్ని కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని, రైతుల డిమాండ్లను పరిష్కరించాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న, సీపీఎం పట్టణ కార్యదర్శులు లక్ష్మన్న, కల్లుబావి రాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆదోని పట్టణంలో స్కూటర్ ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ ఢిల్లీ సరిహద్దుల్లో శంబు బార్డర్ వద్ద రైతులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరను చట్టబద్ధత చేయాలన్నారు. పంట రుణాలను మాఫీ చేయాలని, రైతాంగ ఉద్యమంలో మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు.

ఎన్నికల విధులపై అప్రమత్తంగా ఉండాలి



సూచనలిస్తున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోనిరూరల్: ఎన్నికల విధులపై అప్రమత్తంగా ఉండాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ అన్నారు. సోమవారం సాయంత్రం ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికలకు సంబంధించి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఎప్పుడు వచ్చినా అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఎనికల కమిషన్ ఆదేశించిన అంశాలను క్షుణ్ణంగా చదివి, వాటిపై పూర్తిస్థాయిలో అవగాహన తెచ్చుకోవాలన్నారు. ఎన్నికల ఆదేశాల మేరకు ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్టీ, వీవీటీ, వీఎస్‌టీ టీమ్‌లు పూర్తిస్థాయిలో శిక్షణ పూర్తి చేసుకొని ఎన్నికలకు సంసిద్ధం కావాలని చెప్పారు. మార్చి 1వ తేదీలోపు సెక్టోరల్, రూట్ ఆఫీసర్లకు వాహనాలకు సంబంధించిన ప్రక్రియ నివేదికలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఏఓ శేషయ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, డీఎల్‌పీఓ శ్రీనివాసరాజు, గృహనిర్మాణశాఖ డిప్యూటీ ఇంజినీర్ రవికుమార్, ఆర్‌అండ్‌బీ ఏఈ కృష్ణారెడ్డి, డీఎల్‌పీఓ శ్రీనివాసులు, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.